తల్లి పాలే తొలి టీకా

- ఔషధ గుణాలతో వ్యాధి నిరోధక శక్తి
- సీహెచ్‌సీ వైద్యాధికారులు
- వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు



ఉక్కు ఆస్పత్రిలో కరపత్రాలు ఆవిష్కస్తున్న జీఎం నవీన్‌కుమార్, వైద్యులు



ప్రియదర్శిని కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, కార్యకర్త కృష్ణవేణి

పెదగంట్యాడ: తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి, మంచి పోషక విలువలు ఉంటాయని సీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ హేమలత అన్నారు. మండలంలోని 65వ వార్డు ప్రియదర్శిని కాలనీ, 75వ వార్డు నెల్లిముక్కు, 64వ వార్డు జాలారిపల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతపై తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలో ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఇ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కృష్ణవేణి, దుర్గమ్మ, వేణుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. మహిళలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించేందుకు వారం రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలను ఉక్కు ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ప్రారంభించారు. ఆస్పత్రి జీఎం డాక్టర్ ఎ.పి.నవీన్ కుమార్, వైద్యులు డాక్టర్ పి.కె.గౌతమ్, పిల్లల వైద్యులు డాక్టర్ ఎస్. రాజశేఖర్, గైనకాలజిస్ట్ డాక్టర్ జి.సుజాతలు బ్రెస్ట్ ఫీడింగ్ ఎడ్యుకేషన్ పోస్టర్లు, పేషంట్ ఎడ్యుకేషన్‌పై పోస్టర్లు, ఫ్లైయర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సుజాత తల్లిపాలలో వివిధ స్థానాలు, మెలకువలు, ముఖ్యంగా తల్లిపాలలో జీవ సంబంధమైనస్థితి, క్యూ ఫీడింగ్ కాన్సెప్ట్ గురించి వివరించారు. డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ రాధాకుమారి, డాక్టర్ సునీత ఆహాతులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు.



ఇందిరాకాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బిడ్డ ఎదుగుదలకు ముర్రుపాలు దోహదం

గాజువాక : ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఆరోగ్య కేంద్రాల్లోను తల్లిపాల విశిష్టతను సిబ్బంది బాలింతలకు వివరించారు. ఇందిరాకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.మౌనిక మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లిపాలే తొలి టీకా అన్నారు. బిడ్డ ఎదుగుదలకు, ఆరోగ్యానికి ముర్రుపాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాలారి పల్లిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ, డాక్టర్ రమేష్‌బాబు

అధినేతతో ఆత్మీయ భేటీ



గాజువాక నాయకులు, కార్పొరేటర్లతో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి

గాజువాక : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు గురువారం కలిశారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులతో తాడేపల్లిలో నిర్వహించిన సమావేశం అనంతరం వారు అధినేతను కలుసుకున్నారు. జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన వారిలో గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, గుడివాడ సాయి అనూష, నాయకులు గుడివాడ లతీష్, జీలకర్ర నాగేంద్ర తదితరులున్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- డీసీపీ–2 తుహిన్ సిన్హా
- దువ్వాడ పీఎస్ ఆకస్మిక తనిఖీ

అగనంపూడి: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నగర డీసీపీ–2 తుహిన్ సిన్హా ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దాలని, నేరాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అక్కడి సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, కేసులపై ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాల వివరాలపై వాకబు చేశారు. అనంతరం అగనంపూడి సెక్టార్లలో కలియ తిరిగారు. అక్కడ ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. కూర్మన్నపాలెం, వడ్లపూడి, దువ్వాడ, మంగళపాలెంతో పాటు దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో భూ వివాదాలు లేకుండా చూడాలని, అధికంగా నేరాలు జరిగే ప్రాంతాల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు ఉన్నారు.



దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, కేసుల వివరాలు పరిశీలిస్తున్న డీసీపీ–2 తుహిన్ సిన్హా

క్లుప్తంగా

శాకంబరిగా మరిడిమాంబ అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసలోని మరిడిమాంబ అమ్మవారు శాకంబరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ముందుగా జలాభిషేకం చేసిన అనంతరం కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. భక్తులు లలిత, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ఈ అలంకరణ చేసినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బొద్ద గోవింద్

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీలో నిరుపేద మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొద్ద గోవింద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో వంద మందికి చీరలు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు చిత్రాడ వెంకటరమణ, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, బొద్ద సన్యాసిరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా వ్యర్థాలపై ఆందోళన



కాలువ ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న ప్రజలు, సీఐటీయూ నాయకులు

పరవాడ: ఫార్మా వ్యర్థ రసాయనాలను కాలువల ద్వారా విడుదల చేయడం అరికట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తాడి గ్రామ సమీపం నుంచి కాలువ ద్వారా విడుదల చేసిన వ్యర్థరసాయనాలను అక్కడి ప్రజలు గురువారం గుర్తించి ఆందోళనకు దిగారు. కాలువ ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థ రసాయనాలను సీఐటీయూ నాయకులు, ప్రజలు గురువారం గుర్తించారు. కాలుష్యంతో ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాడి సమీపం నుంచి ప్రవహిస్తున్న వ్యర్థరసాయనాలు ఏలేరు కాలువలో కలిసే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గల్లా భార్గవ్, కోమటి గురుమూర్తి, శ్రీను బాలాజీ పాల్గొన్నారు.

అణ్వస్త్ర రహిత సమాజంతో శాంతి సాధ్యం

ఎంవీపీ కాలనీ: అణ్వస్త్రాల రహిత సమాజంతోనే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం చైర్మన్ నరవ ప్రకాశరావు అన్నారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణుబాంబు దాడులను పురస్కరించుకుని సంస్మరణ సభలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావుతో కలిసి ఈ సంస్మరణ సభల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రపంచ శాంతిని కాంక్షించే ప్రతి ఒక్కరూ 6న వీఎస్ కృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగే సంస్మరణ సభకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాశాల ఉద్యోగులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- బీరువాలో బంగారం, నగదు అపహరణ

అక్కిరెడ్డిపాలెం: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి, బీరువాలోని బంగారు, వెండి వస్తువులను చోరీ చేశారు. ఘటనకు సంబంధించి గాజువాక క్రైం ఎస్ఐ మన్మథరావు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జీవీఎంసీ 68వ వార్డు మింది స్టూడియో లైన్‌లోని తమ సొంత ఇంట్లో జింక్ విశ్రాంత ఉద్యోగి ఈటి వెంకటరావు, రాజ్యలక్ష్మి నివసిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు నాగశరత్ సంతు విజయవాడలోని ఫైబర్ నెట్‌లో జీఎంగా పని చేస్తున్నారు. వెంకట్రావు దంపతులు ఈ నెల 27న ఇంటికి తాళం వేసి విజయవాడలోని కుమారుడి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం ఇంటి ముందు శుభ్రం చేయడానికి వచ్చిన పనిమనిషి ముందు డోరు తాళాలు విరగ్గొట్టి ఉండటాన్ని గమనించి, ఇంటి పక్కవారితో పాటు నగరంలోనే ఉంటున్న వెంకట్రావు కుమార్తె సరితకు సమాచారం అందించింది. వెంటనే వచ్చిన సరిత గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బుధవారం అర్ధరాత్రి దొంగలు ముందు తలుపు తాళం విరగ్గొట్టి, లోపలికి ప్రవేశించి, వెనుక డోర్ నుంచి వెళ్లినట్లు గుర్తించారు. బెడ్‌రూమ్‌లోని బీరువాను, లాకర్ తెరిచి సుమారు రెండున్నర తులాల బంగారం, 30 తులాల వరకు వెండి, రెండు ఖరీదైన రిస్ట్ వాచ్‌లు, కొంత నగదు దొంగిలించినట్లు వెంకట్రావు కుమార్తె సరిత ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రైం డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్యామలరావు, సౌత్ ఏసీపీ త్రినాథ్, గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టునున్నట్లు ఎస్ఐ మన్మథరావు తెలిపారు.



తలుపులను వంచేసి తెరిచిన బీరువా



బీరువా నుంచి తీసిన వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

గెడ్డలో పూడిక తొలగింపు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధి మదీనాబాగ్–బచ్చియ్యపేట ప్రాంతంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలోని పెద్ద గెడ్డలో పూడికలను గురువారం తొలగించారు. గెడ్డలో పూడికను తొలగించాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలు జోన్–6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జెడ్సీ వెంటనే సిబ్బందిని ఆదేశించడంతో వారు జేసీబీ సాయంతో పూడికలు తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రామారావు స్ఫూర్తితో 'ఉక్కు' పరిరక్షణ

అగనంపూడి: ఉక్కు పరిరక్షణకు పోరాట యోధుడు వి.వి.రామారావు స్ఫూర్తితో ముందుకు వెళ్తామని ఉక్కు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారానికి 1267వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఏఐటీయూసీ జాతీయ నాయకుడు వి.వి.రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ పోరాటాలకు రామారావు స్ఫూర్తిని కల్గించేవారన్నారు. ఆయన బాటలో పయనించి విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణరావు, మసేనురావు, డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, జి.జయ, డి.దేముడు, కనకరాజు, బీఎంఎల్ నాయుడు, సీతారామరాజు, రమేష్, కార్మిక సంఘాల నేతలు విళ్ల రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వి.వి.రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పరిరక్షణ కమిటీ నాయకులు

'మానవత' సేవలు మరింత విస్తరణ

గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను మరింత విస్తరించనున్నట్టు ఆ సంస్థ గాజువాక యూనిట్ చైర్మన్ దీనంకొండ కృష్ణంరాజు తెలిపారు. అందులో భాగంగా శ్రీహరిపురంలో సంస్థ కొత్త శాఖను త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. గాజువాకలో గురువారం ఏర్పాటు చేసిన మానవత సంస్థ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త యూనిట్‌ను ప్రారంభించడానికి సభ్యులంతా సహకరించాలని కోరారు. పేద ప్రజలకు నిస్వార్థ సేవలను అందించడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో యూనిట్ కార్యదర్శి బలివాడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణంరాజు

వెటరన్ చాంపియన్

- అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఉక్కు ఉద్యోగి వరప్రసాద్
- కోచ్‌గా పలు జట్లకు మార్గనిర్దేశం
- రాష్ట్ర వెటరన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సేవలు
- ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్

ఉక్కునగరం: క్రీడల్లో ఆసక్తి ఆయన్ను ఐదు పదుల వయసు దాటినా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనేలా చేస్తోంది. కోచ్‌గా ఎందరో క్రీడాకారులకు మార్గదర్శకత్వం ఇచ్చేందుకు దారి చూపింది. చదువును, క్రీడలను, కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుని సక్సెస్‌ఫుల్ అథ్లెట్‌గా, వెటరన్ చాంపియన్‌గా నేటికీ తరగని ఉత్సాహంతో దూసుకుపోతున్నారు స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగం సీనియర్ మేనేజర్ మంగ వరప్రసాద్. పాఠశాల స్థాయిలో హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సొంతం చేసుకున్న ఆయన కాలేజీలో ప్రవేశించాక అథ్లెటిక్స్‌లో ప్రవేశించి కాలేజ్ చాంపియన్, జిల్లా చాంపియన్ అయ్యారు. ఆటలతో పాటు చదువుపై దృష్టి సారించి ఏయూ నుంచి ఎంఏ (పాలిటిక్స్), ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్), ఎంఏ (సోషియాలజీ)లో పట్టాలు అందుకున్నారు. అన్నామలై యూనివర్సిటీ నుంచి పర్సనల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్‌లో డిప్లమో చేయడంతో పాటు ఏయూ నుంచి బీఎల్ డిగ్రీ అందుకున్నారు. ప్లాంట్‌లో చేరిన నాటి నుంచి అనేక పోటీల్లో పాల్గొంటూ బహుమతులు సొంతం చేసుకున్నారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న వరప్రసాద్

సాధించిన విజయాలివీ..

- వరప్రసాద్ 1984 నుంచి 1987 వరకు ఆల్ ఇండియా యూనివర్సిటీ 5కే, 10కే, 1500 మీటర్ల రన్నింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.
- 1986–87లో స్టేట్ లెవెల్ పోటీల్లో 5 వేల మీటర్ల రన్నింగ్‌ను 15.17 సెకన్లలో ముగించి స్టేట్ రికార్డ్ నెలకొల్పారు.

అథ్లెటిక్ కోచ్‌గా..

గత 25 ఏళ్లుగా స్టీల్‌ప్లాంట్ అథ్లెటిక్ కోచ్‌గా అనేక పోటీలకు టీమ్‌లను సిద్ధం చేయడం, పతకాలు సాధించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2010లో వెటరన్ అథ్లెటిక్స్‌లో ప్రవేశించి జిల్లా జట్టును తయారు చేయడంతో పాటు జిల్లా అసోసియేషన్‌కు కార్యదర్శిగా ఎదిగారు. గత పదేళ్లుగా రాష్ట్ర వెటరన్ పోటీల్లో విశాఖ జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించేందుకు కృషి చేస్తున్నారు.

- 2014లో రాష్ట్ర వెటరన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై రాష్ట్ర జట్టులో కీలకంగా వ్యవహరిస్తున్నారు.
- 2012లో శ్రీలంకలో, 2016లో బ్యాంకాక్‌లో, 2018లో మలేసియాలో జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇండియా తరపున పాల్గొన్నారు. మలేసియాలో జరిగిన పోటీల్లో హై జంప్‌లో కాంస్య పతకం గెలుపొందారు.
- 2018లో నకాస్ సవాస్, 2019లో కౌలాలంపూర్, 2022లో శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీలకు ఆయన ఇండియా జట్టు మేనేజర్‌గా హాజరయ్యారు.
- ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆయన సేవలను గుర్తించి 2024 జూలైలో తమిళనాడు హోసూరులో జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.



జాతీయ స్థాయి విజేతలతో వరప్రసాద్

అందరి సహకారంతో..



ఆటలపై నాకున్న ఆసక్తిని అమ్మ నాన్న గమనించి ప్రోత్సహించారు. ఆ తర్వాత కాలేజీ, యూనివర్సిటీలోని క్రీడాధికారులు, స్టీల్‌ప్లాంట్‌లో నా అధికారులు, యాజమాన్యం అందించిన సహకారంతోనే ఈ విజయాలు సాధించగలిగాను. నా జీవితం చివరి వరకు అథ్లెటిక్స్ కొనసాగించాలన్నదే నా ఆకాంక్ష.

– మంగ వరప్రసాద్

ఎస్సీ వర్గీకరణపై హర్షం

అక్కిరెడ్డిపాలెం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ప్రకటించడంతో ఎస్సీ సామాజిక వర్గాల నేతలు గురువారం ఉత్సవాలను నిర్వహించి, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు పెట్ల అర్జునరావు, కార్యదర్శి పెట్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పెట్ల అప్పారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చెవ్వేటి సూర్యనారాయణ, ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెట్ల వెంకటరమణ, జిల్లా ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షుడు ఈతలపాక మంగరాజు, జగ్జీవన్ రాం యూత్ ప్రతినిధులు, సంఘం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



తుంగ్లాంలో సంబరాలు నిర్వహిస్తున్న సేవాసంఘం ప్రతినిధులు

దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో శతాబ్దం నుంచి నిర్వహిస్తున్న దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియమాత ఏ విధంగా లోకానికి తల్లిగా మారిందో విశదీకరించారు. ముందుగా శిలువ గుర్తు వీధిలో దేవమాత పతాకాన్ని పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం సెబాస్టియన్ కాలనీ, బిషప్ మరియదాస్ కాలనీ, రావులపల్లి, వడిచర్ల, నికోలస్, దయాస్, రాసా వీధుల్లో తేరును ఊరేగించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు వినయ్ కుమార్, ఆంథోనీ రాజ్, ఆంధ్రా క్యాథలిక్ యూనియన్ ప్రెసిడెంట్ బూర శేషుబాబు, పీపీసీ సభ్యులు పి.ఫ్రాన్సిస్, జి.ఆనందరావు, నిర్మల రాజు, రత్నం, గురు మండలి సలహా సంఘం ప్రతినిధులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



తేరు స్వరూపాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

స్టీల్‌ప్లాంట్ యువ కార్మికుల ధర్నా



ఉక్కు అడ్మిన్ విభాగం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువ కార్మికులు

ఉక్కునగరం: ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు డిమాండ్ చేశారు. ఉక్కు అడ్మిన్ విభాగం వద్ద గురువారం ధర్నా చేశారు. జీతాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యువ కార్మికులు మాట్లాడుతూ ప్రతీ నెలా జీతాల కోసం యాజమాన్యాన్ని అడుక్కునే పరిస్థితి రావడం దుర్మార్గమన్నారు. సకాలంలో జీతాలు ఇప్పించడంలో కార్మిక సంఘాలు విఫలమయ్యాయన్నారు. జీతాలు చెల్లించే వరకు ప్రతీ రోజు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యువ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి వినతి

గాజువాక : 65వ వార్డు కేఎల్ రావు నగర్‌లో పార్కును అభివృద్ధి చేయాలని ఆ కాలనీ అసోసియేషన్ ప్రతినిధి సందీప్‌రెడ్డి జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు కమిషనర్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. పదిహేనేళ్లుగా పార్కు అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇటీవల ఎన్నికలకు ముందు రూ.40 లక్షలు మంజూరైనా, ఆ నిధులు కూడా పూర్తిస్థాయిలో ఖర్చు కాలేదన్నారు. దీనిపై వెంటనే పరిశీలించి పార్కు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: అగనంపూడి 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా అగనంపూడి నిర్వాసిత కాలనీలు, అగనంపూడి పరిసర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.